

# మన రచయిత/త్రులు

## మద్దారి రాజ్యశ్రీ



*'మన రచయిత/త్రులు ' పేరిట శ్రీమతి రాజ్యశ్రీ ఒక్కొక్క రచయిత / రచయిత్రిని విశ్లేషిస్తూ, వాళ్ళ నవల నొకదానికి సమీక్ష రాస్తారు. శ్రీమతి రాజ్యశ్రీ ఎమెస్కో అధినేత శ్రీ యం,యన్,రావుగారి అమ్మాయి. ఆమె యం.ఎన్.రావుగారి గురించి రాసిన వ్యాసం మన కౌముదిలో మే నెలలో ప్రచురించాము. ఆమె 200 పైగా నవలలకు ఎడిటోరియల్ వర్కు చేశారు. రీడర్స్ రిపోర్టు రాయటం, బాక్ కవరు మేటర్ రాయటం, పుస్తక ప్రపంచంలో రాబోయే నవలకు సమీక్ష రాయటం చేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు మన కౌముది ద్వారా మీ ముందుకు వస్తున్నారు.*

## కొమ్మూరి వేణుగోపాలరావు - మనస్తత్వశాస్త్రవేత్త

*అబ్బో మనుషుల్లో ఎన్ని రకాలు! జీవితంలో దూరి జీవించే వాళ్ళు కొందరు, పైపైన ప్రేక్షకుల్లా నిలబడి జీవించేవారు కొందరు, ఆలోచనాత్మకంగా జీవించేవాళ్ళు కొందరు, ఏ ఆలోచనా లేకుండా యాంత్రికంగా జీవించేవారు కొందరు, తమకంటూ ప్రత్యేకమైన శైలిని రూపొందించుకుని ఆ శైలిని చెక్కుచెదరకుండా కాపాడుకుంటూ జీవించేవారు కొందరు, ఏ శైలీ లేకుండా ఎటుగాలి వీస్తే అటు కొట్టుకు పోతూ జీవించేవారు కొందరు.*

మనుషుల్లో ఎన్ని రకాలున్నారో, కొమ్మూరి వేణుగోపాలరావుగారి నవలల్లో అంత వైవిధ్యం ఉంది. మధ్యతరగతి మందహాసం ఉంది, సోకాల్డ్ హైసొసైటీలోని విశృంఖలత్వం ఉంది, బడుగు జీవితాల నైరాశ్యం ఉంది. ప్రేమించే హృదయం ఉంది., దగా పడిన జీవితం ఉంది, జీవితం మీద ఆశ ఉంది, కసి కూడా ఉంది స్త్రీ పరంగా కథలున్నాయి, హీరో పరంగానూ ఉన్నాయి.

ఇంత వైవిధ్యంలోంచీ, ఇంత భిన్నత్వం లోంచీ ఏకత్వం ఏమిటని ఏరాలంటే చాలా కష్టమే అయింది. ఇన్ని రకాల మనస్తత్వాలనీ విడమరచి, పూసగుచ్చి చెప్పారాయన. ఒక్కోసారి కోపంగా ముక్కు గుద్ది చెప్పిన సందర్భాలు లేకపోలేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మనస్తత్వ విశ్లేషణ ఆయన ప్రత్యేకత.

ఇంకో ప్రత్యేకత ఆయన నవలల్లోని ప్రధాన పాత్ర చాలా విశిష్టమైన వ్యక్తి. తమకంటూ ప్రత్యేకమైన శైలిని రూపొందించుకుని ఆ శైలిని చెక్కు చెదరకుండా కాపాడుకుంటూ జీవిస్తారు!

'నీ జుట్టులో, కనుబొమలలో, నవ్వే పెదాలలో, పలు వరసలో ఓ ప్రత్యేకత ఉంటుంది. స్పష్టతతో కూడిన ప్రత్యేకతలో కన్నా అస్పష్టతతో కూడిన ప్రత్యేకతలో ఓ ఆకర్షణ ఉంది. నీ కళ్ళలో కాంతి.. అదొక్కటి చాలు నిన్ను లక్షమందిలో విలక్షణంగా నిలబెట్టటానికి.'

'మీ అక్షరాల గారడీ వెనక మహత్తరమైన మీ వ్యక్తిత్వం దృగ్గోచరమైంది. లోకంలో అన్నిటి కన్నా గొప్పది విశిష్టమైన వ్యక్తిత్వం. ఆ

నిజరూపానికి ప్రణమిల్లి నా హృదయ క్షేత్రంలో మీకో మహోన్నతమైన స్థానం కల్పించుకున్నాను.'

ఈ విశిష్ట వ్యక్తి పక్కనే చెడు ఉంటుంది. అందులోకి లాగటానికి ప్రయత్నిస్తారు ఎవరో ఒకరు. 'ఈ ప్రపంచాన్ని సెక్స్ పరిపాలిస్తోంది. డబ్బు పరిపాలిస్తోంది. పవర్ పరిపాలిస్తోంది. గుండాలు పరిపాలిస్తున్నారు. బాధితుల కెక్కడా న్యాయం జరగదు. పోలీసుల దగ్గరకు వెళితే ఎవరో కొందరు తప్ప లైసెన్స్‌డ్ గుండాల్లా ప్రవర్తిస్తారు' అంటారు. లేదా అవకాశం ఉంటే నివేదితను చేసినట్టు ఆమెను దుర్వ్యసనాల పాలు చేస్తారు... 'ఆ ఎత్తయిన సౌధోపరి భాగం నుండీ ఆమెను క్రిందకి తీసుకురావాలని ఆమెను క్లబ్బులకి తీసుకెళ్ళాను. డాన్సులు చేయించాను, పేకాట నేర్పించాను. రేసులకి తీసుకెళ్ళి ఆడించాను. ఆమె చుట్టూ ఉన్న సమాజం ఇంకొంచెం కిందకి దించింది. ఆమెతో సిగరెట్లు కాల్పించింది, మాంసం తినిపించింది, మధువు సేవించేటట్లు చేసింది.'

అలా ఆయన హీరో / హీరోయిన్లు అందరూ లొంగరు. ఒకవేళ లొంగినా అది తాత్కాలికమే. 'గుర్తింపు ఉండే జీవితం అవసరమే. కాని ఆ గుర్తింపు కోసం ఇంత బరి తెగించి ఉండకూడదు. అలా కాకుండానే నేను సాధిస్తాను' అని సతిశ్రీ ద్వారా తన కారెక్టర్ల గురించి చెప్తాడు.

వాళ్ళెంత మహోన్నతులో, మధ్యలో ఏమైనా ఢక్కా మొక్కీలు తిన్నా వాళ్ళ లక్ష్యం ఎలా సాధిస్తారో మొదట్లోనే చెప్పీ చెప్పకుండా చెపుతారు.

'మితిమీరిన నిశ్చలత, అతి దృఢమైన మనస్సు, ఉండవల్సిన దానికన్న ఎక్కువ పరిధిలో ఆక్రమించుకున్న శాంతి, ఇతరులకు అందకుండా ఉన్నతంగా ఎదిగిన గుండె ఒకానొక సమయంలో భళ్ళున ఏడ్చేస్తాయి. చిన్న కదలికే ఆ సమయంలో మహా శక్తితో కూడిన కదలికలా వారిని స్పర్శించి ఊపివేస్తుంది కానీ ఆ ఏడుపే వారికి బలం. అదే వారికి దృఢత్వం, ఆత్మవిశ్వాసం. విశాలత్వం ప్రసాదిస్తుంది!' అంటారు మొదట్లోనే. అందుకే నివేదిత మధ్యలో ఎంత పతనమైనా ఆమె గమ్యమేమిటో మనకు తెలిసిపోతుంది. చివర్లో నివేదితే వివరిస్తుంది ఆ విషయం.

'మొదటినుంచీ నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనా చర్విత చర్వణం చేసుకుంటే నా ఉనికి మామూలు సామాజిక జీవితంలోని సామాన్య బ్రతుకు బాట కోసం నిర్దేశింపబడినది కాదనీ, అంతకంటే అతీతమైనది కాకపోయినా ప్రత్యేకమైన మరో పంథాలో జీవన యాత్ర సాగించటానికి నియమితురాలినైయినాననీ స్ఫురిస్తోంది.'

అలా చూస్తూ పోతే ఆయన జీవితాన్ని కాచి వడపోశారనిపిస్తుంది. ఒక్కో నవలలో స్కాచి(విస్కీ) వడపోసిన సందర్భాలూ లేకపోలేదు. అది వేరే విషయం. ఉదాహరణకు 'అందమైన ఆడదాన్ని చూసి చలించటంలో, కోరికలతో రగలటంతో ఆశ్చర్యం లేదు. కాని తనకున్న అర్హతల్ని గురించి ఆలోచించకుండా ప్రతి బేవార్సుగాడూ ఆమె మీద తనకేదో హక్కుందనుకుంటాడు.'

'మగాడు ఆడదాన్ని తిడతాడు, కొడతాడు, తాగుతాడు, పరస్త్రీ వ్యామోహంతో కొన్ని వెధవ పనులు చేస్తూ ఉంటాడు. కానీ ఆడవాళ్ళు తాగరు, తందనాలాడారు, మగవాడిని తన్నరు. కానీ వాళ్ళ డిప్రెషన్స్‌తో, పర్‌వర్షన్స్‌తో, గయ్యాళితనంతో, మూర్ఖత్వంతో, అజ్ఞానంతో, అహంకారంతో, శాడిజంతో మగాడిని పీల్చి పిప్పిచేస్తుంటారు. వాళ్ళలో గొప్పతనమేమిటంటే ఇంత అరాజకమూ చేసి తప్పంతా మగాడిదయినట్లు నిరూపిస్తారు. మగాడు చేసే భీభత్సం బయటకు కనబడుతూ ఉంటుంది. ఆడది చూపించే నరకం విశ్లేషించటానికి వీలు లేనట్లుగా ఉంటుంది. '

'మదన్ రచనల్లో నాకు కనిపించే విశేషమేమిటంటే నవలంతా వెతికినా ఒక్క వృధావాక్యం నాకు కనపడలేదు. రాసిన ప్రతి అక్షరమూ ఆ కథాకథనంతో బిగువుగా ఇమిడిపోయినట్లు అమరి ఉంటుంది' అని కొమ్మూరి వేణుగోపాలరావుగారు చెప్పిన విషయం ఆయనకే మనం ఉపయోగించవచ్చు.

# హౌస్ సర్జన్

## డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు




*అబ్బ ఎన్ని రకాల మనస్తత్వాలు? ఏ గొప్పకవీ, మహా రచయితా వీటిని తరుచుకుంటూ పోయి, ఆ లోతుల్ని, వెతుక్కుంటూ, మధిస్తూ.... ఈ భయంకరమైన సత్యాలను శోధించలేకపోయాడేం?*

'హౌస్ సర్జన్' పేరు వినగానే బాబోయ్ ఇది మనకు బుఱ్ఱకెక్కదు అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్లే! రాష్ట్రస్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో మెడికల్ ఫిక్షన్‌లో అపూర్వ గ్రంథంగా దూసుకొచ్చిన మహత్తర నవల ఇది. ఇందులో అందరి మనస్థత్వ విశ్లేషణ ఉంది. జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ నుంచీ వార్డ్‌బాయ్ దాకా సిస్టర్ల దగ్గర్నుంచీ పేషెంట్ల దాకా అందరి గురించీ ఉంది. అంతర్లీనంగా ప్రేమ కథ ఉంది. డాక్టరంటే శరీర రుగ్మత కనిపెట్టేవాడే కాదు, మనసులోకి దూరి చూడగలడు అని అద్దం పట్టి చూపిస్తుంది. ఇంకా ఆశ్చర్యమేమిటంటే ఎంతో కవితాధోరణి కూడా ఉంది.

'మెడిసన్ ఓ సముద్రం, లోతు తెలియని, అవతలి ఒడ్డు తెలియని మహా సముద్రం. దాని లోతుపాతులు తెలుసుకోకుండా బయట నిలబడి చూస్తే అందులో ఈదటం చాలా తేలికనిపిస్తుంది. లోనికి దిగామా? ఆ ఆరాటానికి అవధులు లేవు. విజ్ఞానం మీద తృష్ణేగానీ తృప్తి అనేది లేదు!

'మెడిసన్! మెడిసన్!! మెడిసన్!!! అవే నాకలలు. అదే నా ఆశాజ్యోతి. అదే నా జీవిత పరమావధి. '

ఇలాంటి తృష్ణ, ఇలాంటి జీవిత పరమావధి ఉన్న ఒక హౌస్ సర్జన్ అనుభవాల పరంపరే ఈ నవల.

'హౌస్ సర్జన్‌ల అటెండెన్స్ బుక్‌లో సంతకం పెడుతూంటే చెయ్యి కొద్దిగా వొణికింది. గర్వమని చెప్పలేను కానీ నేను కూడా డాక్టర్నయానన్న సంతృప్తి నరనరాల్లో ఆవహించి చైతన్యం కలిగించింది' అంటాడూ డాక్టర్ ఎస్. మధుకరరావు. మొదలు పెడుతూనే ఓ.పిలో, అందులో ఆడవాళ్ళ ఓ.పి.లో చిక్కుకుంటాడు. పేషేంట్లని పిలుస్తానని నర్సు అంటే, 'ఉండండి, అలా కంగారు పెట్టకండి. ఈ పుస్తకాలు వగైరా ప్రొసీజర్ చెప్పండి' అని అవి తెలుసుకుని పేషెంట్లని ఒక్కొక్కళ్ళని ప్రశ్నలడిగి పరీక్ష చేసి పంపించడం మొదలుపెడతాడు. చాలా త్వరగా పంపిస్తున్నాననుకుంటాడు గానీ తీరా చూస్తే నలుగురు కూడా కదలరు మొదటి అరగంటలో. అప్పుడు సిస్టరు నళిని చిట్కా చెపుతుంది.

అలా మొదలైన మొదటిరోజు ఆఖరయ్యేలోపు ముగ్గురు పేషేంట్లు తన కళ్ళముందే ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు చనిపోతారు. పొడవైన వసారాలో ఒంటరిగా నడుస్తూ, 'నా మీద నాకు ఆత్మవిశ్వాసం నశించి పోయినట్లూ, ఎందుకూ పనికిరాని వాడినిగా అయిపోయినట్లూ అనిపించింది. ఒకదాని వెంట మరొకటి, మూడుచావులు ఎంత తేలికగా అనుకోకుండా జరిగిపోయాయి! ఇవన్నీ చూస్తూ ఉండటానికేనా నేను డ్యూటీ చేస్తున్నది? లేకపోతే మరేమిటి? ఈ విద్య అంతా వొట్టి మిధ్యయేనా?" అనుకుంటాడు.

ఆ స్టేజి నుంచీ అతి తక్కువ కాలంలోనే 'మార్వలెస్! ఈ భూమి మీద ఏ దిక్కుకు పోయినా మీకు తిరుగులేదు, నామాట నమ్మండి' అన్న మెప్పు సి.ఎం.ఓ నుంచీ పొందుతాడు. ఓపెన్ మెథడ్‌లో కార్డియాక్ మసాజ్ చేస్తే ఈ మాట అని కావిలించుకున్నంత పని చేస్తాడాయన. ఆ మాటకొస్తే అతను స్టూడెంట్ డేస్‌లోనే 40 పైగా ఎఫిసియాటమ్‌లు చేసి 'ఎఫిసియాటమ్‌కింగ్'గా పేరు తెచ్చుకుంటాడు. హాస్టల్ బయట ఉంటే హౌస్ సర్జన్ పిరియడ్‌లో ఎక్కువ నేర్చుకోలేమోనని హాస్పటలుకి మకాం మార్చేసుకుంటాడు. సాయంత్రాలు సాధారణంగా ఎక్కడకూ పోయేవాడుకాదు. అంతకు ముందే తోటి హౌస్ సర్జన్లతో సంభాషణ వచ్చినప్పుడు వారి వారి వార్డులలో ముఖ్యమైన కేసులు ఏమున్నాయని వాటి వివరాలు అడుగుతుండేవాడు. అతని ఆసక్తి చూసి నవ్వుకునేవాళ్ళు లేకపోలేదు. కొంత

మంది మాత్రం నిజయాతీగా సమాధానమిచ్చేవాళ్ళు. ఆ ప్రకారం సాయంత్రం వేళల అన్ని వార్డులూ తిరుగుతూ ఇంటరెస్టింగ్‌గా ఉండే కేసులు చూసుకుంటూ ఉండేవాడు.

'అదేమిటంటే ఎక్కడ చూసినా మీరే కనిపిస్తారు? మీకు హాస్పిటలే ఇల్లు వాకిలా? ఇంకేమీ వ్యాపకాలూ, సరదాలూ లేవా?' అనేవారు సిస్టర్లు. 'కాలక్షేపం ఇక్కడ ఉండగా వేరే వ్యాపకాలెందుకు?' అన్నాడొక సిస్టర్‌తో.

అది మాటవరసకే కానీ ఏ మాత్రం నిజం లేదు, త్వరలోనే పేషెంట్ల చేత, 'డాక్టరుగారు మంచి మారాజు. అంతకు ముందు చేసినాయన ఎప్పుడూ చిటపటలాడుతుండేవాడు. ఈయన ముఖాన ఎప్పుడూ చిరునవ్వు చిందుతూ ఉంటుంది. కోపమంటే ఏమిటో ఎరగడు' అనీ.

'ఈ డాక్టరుగారు ఇంజక్షన్ చేస్తే చేసినట్లే ఉండదు. చల్లని చెయ్యి బాబుగారిదిది' అనీ మెప్పు పొందుతాడు.

'ఇన్నిసార్లు హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయినా మీ అంత కర్తవ్యపరాయణుడైన డాక్టర్ని చూడలేదు. మిమ్మల్ని చూస్తుంటే ముచ్చట వేస్తోంది' అనే ప్రశంసా పత్రం కూడా పొందుతాడు.

ఒకసారి మూడేళ్ళ పిల్లవాడు డిఫ్తీరియా వచ్చి ఊపిరందక తల్లకిందులైపోతున్నాడు. ఇ.ఎన్.టి, అసిస్టెంట్ అందుబాటులో ఉండదు. అతనికి వెంటనే ట్రికియాటమీ చేయకపోతే అతని ప్రాణాలకే ముప్పు. మధు ఎప్పుడూ చేయలేదు కానీ టెక్నిక్ క్షుణ్ణంగా తెలుసు. 'మెడదగ్గర స్పిరిట్‌తో శుభ్రం చేసి, ఒక్కసారి వేళ్ళతో తడిమి చప్పున ఇన్సిషన్ ఇచ్చేశాను. ఆ చీలికలను వెడం చేసి లోపలకు పోతుంటే వేళ్ళు వణికాయి. భగవంతుడి మీద భారం వేసి చకచకా మూడు నిమిషాల్లో పూర్తి చేసి, ట్యూబ్ కూడా ఇమిడ్చి ఇవతలకు వచ్చి గ్లవ్స్ తీసేసి చేతులు కడుక్కున్నాను' అంటాడు.

మహా చెడ్డ విసుగు మనిషి అయిన డాక్టరు నాయుడుగారు కూడా అభినందన పూర్వకంగా భుజం మీద కొట్టి 'రిస్క్ తీసుకున్నా మంచి పనే చేశారు డాక్టరుగారు! ఆ కుర్రాడు జీవితాంతం మీకు ఋణపడి ఉండాలి' అంటాడు. ఈ వార్త తెలిసిన హౌస్ సర్జన్లంతా వచ్చి అభినందిస్తారు.

అవకాశం వచ్చినప్పుడల్లా అలాగే చిన్న చిన్న ప్రయోగాలు చేయటం అతనికి సరదాగా ఉండేది. ఓ కలరా కేసుకు ఓపెన్ మెథడ్ చేస్తాడు. అంటే చర్మం కోసి రక్తనాళం బయటకు తీసి, అందులోకి సరాసరి సూదిద్వారానో పాలిథిన్ ట్యూబ్ ద్వారానో సెలైన్ ఎక్కించటం అన్నమాట బ్రహ్మ విద్య అనికాదు కానీ ఇది వరకెప్పుడూ చేయలేదు. ముందు ఒక శవం మీద ప్రాక్టీసు చేసి వెంటనే పేషెంట్ మీద చేస్తాడు. అలాగే లంబార్ పంక్చర్ వెన్నెముక దగ్గర ప్రత్యేకమైన సూదితో పొడిచి, నీరు బయటకు తీయటాన్ని లంబార్ పంక్చర్ అంటారు. ' మొదటి రోజున అది చేయవలసి వచ్చినప్పుడు చేతులు వణికి గాభరా పడిన మాట నిజమే. కానీ రాను రాను అలవాటైపోయి, రోజూ ఇంచు మించు ఒకటి చేస్తూ ఉండేవాణ్ణి. అవకాశాలు కూడా అలాగే వచ్చేవి. ఎప్పుడన్నా అవకాశం రాక ఒకరోజు చెయ్యలేకపోతే ఆ రాత్రి నిద్రపట్టక ఏదో వెలితిగా ఉన్నట్లు అనిపించేది!'

అతని తృష్ణ చూసో ఏమో డ్యూటీ రోజున పేషెంట్లు దండయాత్ర కొచ్చినట్లే వచ్చేవాళ్ళు. చాలామంది హౌస్ సర్జన్లు, 'రాత్రి హాయిగా నిద్రపోయాననో, వేరుశెనక్కాయలు తింటూ కాలక్షేపం చేసాననో' అనే వాళ్ళు. కానీ మధుకాయోగమెన్నడూ పట్టలేదు. ఏనాడు డ్యూటీ రోజున సుఖంగా నిద్రపోయి ఎరగడు. అలా నిద్రపోలేదని అనుకుని ఎరగడు.

డాక్టరు మధుకి సర్జికల్ వార్డు అంటే మొదటినుంచీ ఎంతో ఇష్టం. 'గొప్ప సర్జన్ కావాలని ఎన్ని కలలు కంటున్నానో' అంటాడు. డ్యూటీ రోజు వచ్చిందంటే ఎమర్జన్సీ అవకాశం కోసం కాచుకు కూర్చునేవాడు. మొదటి రోజు ఆపరేషన్ చేయబోయే ముందు చేతులు కడుక్కుని వెళ్ళడంతో కొంత నవ్వులు పాలయినా పెద్ద డాక్టర్లు ఇతనికే కోరి ఎన్నో కేసులు అభిమానంగా ఇచ్చే ఎత్తుకు ఎదుగుతాడు.

'ఏమండీ! మీరు సర్జరీ అంటే ఇంత ఇంటరెస్టు చూపిస్తారు కదా! ఛాన్స్ ఇమ్మని అడగరేం? అడగందే మాకు ఇవ్వాలని ఉండదు తెలుసా? ' అంటారు మూర్తిగారు.

'ఆపరేషన్ చేస్తుంటే ఎంత థ్రిల్ ఉండేది! చెప్పలేని ఆనందం, సొగసు ఉన్నాయి అందులో. రాత్రిళ్ళు ఆ మధురాలోచనలతో నిద్రపట్టేది కాదు. అసలు రాత్రిపూట చాలా తక్కువ సేపు నిద్రపోయేవాణ్ణి. సాధారణంగా పన్నెండు గంటల ముందు కుర్చీ వేసుకుని కూర్చుంటే ఎదురుగుండా ఆపరేషన్ థియేటర్ కనిపిస్తూ ఉండేది. నా డ్యూటీ రోజు కాకపోయినా, థియేటర్లో లైటు వెలిగిందంటే వెంటనే లేచి బట్టలేసుకుని వెళ్ళిపోయేవాడిని. అలా ఎన్నో ఆపరేషన్లు చూశాను' అంటాడు డాక్టర్ మధు.

ఒకసారి అంబలికల్ హెర్నియా పేషెంటు వస్తాడు. 'ఇప్పటికే వీళ్ళు ఆలస్యం చేశారు. వెంటనే ఆపరేషన్ చేయాలి' అంటారు డాక్టరు శేఖరం.

'అనకూడదు కానీ అప్పుడెంత సంతోషం కలిగింది.' ఒకరకంగా వైద్యవృత్తి అతి క్రూరమైనది. ఆపరేషన్ చేయడానికి అద్భుతమైన కేసు లభించింది కదా అని నేను ఉప్పొంగిపోతున్నాను. అది ఆ వ్యక్తికి జీవన్మరణ సమస్య. అలాగే ఓ అసలైన హార్ట్‌కేసు చూసి ఫిజీషియన్ 'ఆహా! వినండి, వినండి మర్మర్ ఎంత బ్యూటిఫుల్ వినిపిస్తుందో' అంటాడు. ఈ వృత్తిలో ఎంత దారుణం ఉంది' అంటాడు మధు. కానీ ఆపరేషన్ చేసి, ఆ పేషెంటు బ్రతికి బట్ట కట్టేవరకూ వాళ్ళు పడే తపన చెప్పలేనిది. అలా తపన పడే రంగయ్యగారి గురించి ఇలా వర్ణిస్తాడు. 'సర్జరీయే ఆయన జీవితం! హాస్పటలే ఆయన ప్రపంచం. ఏదైనా ఓ కేసు ఫెయిలయి, పేషెంటు చావుబతుకుల్లో ఉంటే ఆయన పడే శ్రమ, తాపత్రయం, పిచ్చెత్తినట్లయి పోయే ఆయన వాలకం చూస్తే ఒక్కోసారి భయం వేసేది. ఏ కేసైనా సీరియస్‌గా ఉంటే, బెడ్ దగ్గర్నుంచీ కదిలేవారు కాదు. పేషెంటును బ్రతికిద్దామని చేసే ప్రయత్నంలో రక్తం ధారబోసేవాడు. అంత ప్రయత్నమూ వృధా అయి, పేషెంటు దక్కకపోతే రెండు రోజులు దాకా ఈ ప్రపంచంలో పడలేకపోయేవారు.'

పేషెంట్ గురించి అన్ని రకాల జాగ్రత్తలూ తీసుకునేవారు ఛీఫ్ చక్రపాణిగారు. ఆయన రౌండ్స్‌కి వస్తున్నారంటే వాతావరణంలో గొప్ప సంచలనమేర్పడేది. సిస్టర్స్, స్టాఫ్ అంతా హడలిపోయేవారు. పేషెంటుకి తలనూనె రాశారా లేదా అన్న విషయం దగ్గర్నుంచీ బెడ్ షీట్ శుభ్రంగా ఉన్నదా లేదా, వాళ్ళకి సరిగ్గా మందులందుతున్నాయా లేదా, టెంపరేచర్ ఛార్ట్ సరిగ్గా నింపుతున్నారా లేదా, ఆహారం ఏమేమి ఇస్తున్నారు అనేవరకూ అన్నీ శ్రద్ధగా గమనిస్తూ ఉండేవారు. వాళ్ళ పాపమేమిటో ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఏదో ఒక తప్పు ఆయన దృష్టిపథంలో పడుతూనే ఉండేది. ఇహ దుయ్యబట్టడం మొదలుపెట్టేవారు. మొదలుపెట్టారంటే అవతలి వ్యక్తికి నషాళానికి ఎక్కి కళ్ళనీళ్ళు తిరిగేదాకా వదిలిపెట్టేవారు కాదు. అలా ఎందుకు చేసేవారో ఆయనే ఒకచోట చెప్పకనే చెపుతారు. 'ఒక రోగికి ఒక పూట ఇంజక్షన్ ఇవ్వడం మరచిపోతే, అది మీకు సామాన్యంగా కనిపించవచ్చు కానీ ఆ విషయమే అతని మనసుని తొలిచి వేసి ఆ రాత్రంతా నిద్రపట్టకుండా చేస్తుంది' ఆయన అన్నదాంట్లో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

'కొంతమంది వార్డులో ఇంజక్షన్ ఇస్తున్నప్పుడు, తమనెక్కడ మరచిపోతారేమోనని ప్రాణాలు బిగబట్టుకుని, చేతిలో సిరంజితో అటూ ఇటూ తిరుగుతున్న హౌస్ సర్జన్ వంక ఆశగాచూస్తూ, కదలిక ద్వారానో, ఓ చతురోక్తి ద్వారానో అతని దృష్టినాకర్షించటానికి ప్రయత్నిస్తూ ఉండేవారు. వాళ్ళకి ఇంజక్షన్ ఆపేయమన్నారని చెప్పినా వినకుండా బ్రతిమాలేవారు, పేచీ పెట్టేవారు, దెబ్బలాడేవారు.'

అసలు పేషెంట్లలో రకరకాలుంటారు. కొంతమంది హాస్పిటల్ని నరకకూపంతో పోల్చుకుని, ఎప్పుడు అక్కడి నుండీ బయటపడదామా అని చూస్తుంటే, మరి కొంతమంది ఏకరువు పెట్టే శరీర రుగ్మతలకు అంతేలేదు. వాళ్ళ చేత 'నాకు కులాసాగానే ఉంది' అనిపించలేం. కొంతమంది రోగులు హౌస్ సర్జన్లతోనూ, అసిస్టెంట్లతోనూ, ఛీఫ్‌తోనూ తమ బాధలను రకరకాలుగా మార్చి చెపుతుండేవారు. ఒకరికి చెప్పేదానికీ, మరొకరికి చెప్పేదానికీ సంబంధం ఉండేదికాదు. ఇక స్పెషల్ రూము వాళ్ళు, అందులోనూ బి.క్లాస్ గదుల్లో ఉండే పేషెంట్లు అతి గారాబాలు చేస్తారు. 'నాకు నిద్రపట్టటం లేదు సిస్టర్' అనో 'కడుపులో వికారంగా ఉంది సిస్టర్' అనో

వరుసగా కంప్లైంట్లు చేస్తూనే ఉంటారు.

'ఇక్కడి మనుష్యులూ, ఇక్కడి మస్తత్వాలూ, ఇక్కడి సందడీ, ఇక్కడి వాతావరణం నాకెంతో ఇష్టం,' అంటుందొక పేషెంటు. బయట ఒంటరి జీవితం కన్నా ఇక్కడ డాక్టర్లను, నర్సులను, వాళ్ళ స్టెతస్కోపులను, తోటి రోగులనూ చూడడం ఆవిడ సరదా. ఒక్కో పేషెంటు ఒక్కోసారి చాలా దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తారు. ఒళ్ళంతా కాలిపోయినా ముఖం మాత్రం దేవకన్యలా మెరిసిపోతున్న ఒక స్త్రీ రెండు, మూడు సార్లు మనసు విప్పి మాట్లాడుదామని ప్రయత్నిస్తుందికానీ కుదరదు. మధుకి కూడా ఇష్టం ఉండదు. 'ఈమె గురించి ఏమీ తెలుసుకోకూడదు. ఆమె నాకేమీ చెప్పకూడదు. రూపంలో కనిపించిన బరువు, ఆర్ద్రత ఆమె మాటల్లోని సత్యంలో ఉండకపోవచ్చు. ఆ సత్యం నేను తెలుసుకోలేకపోవడం మంచిది' అనుకుంటాడు.

'హాస్పిటల్ వాతవరణం చాలా విచిత్రమైనది. అది ఓ వింత ప్రపంచంలాంటిది. రకరకాల మనస్తత్వాలు, భిన్న ప్రవృత్తులు అక్కడ కనబడతాయి. ఒక్కోసారి సహజలోకానికి దూరంగా, ఏదో కృత్రిమ ప్రపంచంలో జీవిస్తున్నట్లు ఉంటుంది. ఒక్కోసారి ఇదే నిజం, ఇదే సత్యం, సృష్టికి మొదలు తుదీ కూడా ఇక్కడే అనిపించి, తెలియని గర్వం కూడా ఆవహిస్తూ ఉండేది' అంటాడు.

'మమ్మల్ని చూస్తే మీకేమనిపిస్తోంది?' హఠాత్తుగా అడుగుతుంది సిస్టర్ లలిత.

అంతే హఠాత్తుగా జవాబిస్తాడు మధు 'మిమ్మలనే కాదు. ఏ సిస్టర్ని చూసినా నాకెప్పుడూ ఒకటే అనిపిస్తుంది. ముఖమంతా బాగానే అద్దుకుని చెవుల దగ్గర మాత్రం ఎందుకు వదిలిపెడతారు పౌడర్ అని'

సిస్టర్లలో కూడా రకరకాలుంటారు. 'వాళ్ళెప్పుడూ అతి సీరియస్‌గా పేజీలకు పేజీలు రికార్డు రాసేస్తూ ఉండేవారు. వాళ్ళేమి రాస్తారో అర్థమయ్యేది కాదు. ఆ పుస్తకం తీసి ఈ పుస్తకం, ఈ పుస్తకం మూసేసి మరో పుస్తకం ఇట్లా తెగరాసేవాళ్ళు. పేషెంటుకి నెత్తురు తీయడానికి, లంబార్ పంక్చర్ చేయడానికి, ఇంకా కొన్ని పనులకూ సిస్టర్స్ తప్పనిసరిగా పక్కన ఉండాలి. వాళ్ళకి సహాయం చేయాలని ఉన్నా కుదిరేదికాదు. కొంతమంది సిస్టర్స్ అతి సీరియస్‌గా ఉండేవాళ్ళు వాళ్ళకేమైనా పనిచెపితే ఉలకరు, పలకరు, ఊఅనరు. వాళ్ళకు వినిపించిందీ తెలియదు, వినపడనిదీ తెలియదు. గట్టిగా చెపితే కసురుకుంటారు. కానీ తరచి చూస్తే సిస్టర్లంతా ఎంతో మంచివాళ్ళు. వారితో మృదువుగా వ్యవహరిస్తూ, తమ మర్యాద కాపాడుకునేటంత గంభీరంగా ప్రవర్తిస్తే వాళ్ళంతో వినయంగా మసులుకుంటారు.

నలుగురు సిస్టర్స్ కలిసినప్పుడు హౌస్‌సర్జన్ల గురించి, అసిస్టెంట్లను గురించి మాట్లాడుకోవటమూ, నలుగురు హౌస్‌సర్జన్లు కలిసినప్పుడు సిస్టర్లను గురించి, అసిస్టెంట్ల గురించి యధేచ్ఛగా మాట్లాడుకోవటమూ హాస్పిటల్ వాతావరణంలో పరిపాటి అయిపోయింది. అలా పుట్టిందే పుకారు డాక్టరు మధు గురించి, సిస్టర్ నళిని గురించీ 'ఈ ప్రచారం ఎందువల్ల వచ్చింది? ఈ ప్రచారానికి నళినీనే బాధ్యురాలా! మళ్ళీ ఆమె గురించి అంత తేలికగా ప్రవర్తిస్తే సుతిమెత్తగా మందలించి ఆమెలో మార్పు తెస్తాడు. 'నేను మాతృమూర్తినైనా ఫర్వాలేదు, మీ ప్రతిమని ఇంట్లో దాచుకున్నట్లే అయి, అమితానందంలో మునిగిపోతాను' అంటుంది.

'నళినీ! డాక్టర్ల గురించి, నర్సుల గురించీ, హాస్పిటళ్ళ గురించీ మిగతా జనం ఇంత చెడ్డగా చెప్పుకుంటున్నారే, దీనికి కారణం ఏమిటి? మనలో లోపం ఉండబట్టి కదా!... ఒక్కసారి కర్తవ్యాన్ని నెమరు వేసుకుని, అప్పుడు కళ్ళు తెరచి చూడు, నీ ప్రపంచం ఎంత బంగారు మయమో, నీ బాట ఎంత స్వచ్ఛమో, నీ ఉనికి ఎంత నిర్మలమో గోచరిస్తుంది. ఆలోచించు నళినీ! మంచివాళ్ళు ఎక్కువ మంది ఉండరు. కానీ వారి ప్రభావం వేలమంది మీద ప్రసరిస్తుంది. నువ్వు అలాంటి మంచిదానివికా నళినీ!'

మధు ప్రపంచం బంగారు మయమూ, బాట స్వచ్ఛమూ, ఉనికి నిర్మలమూ కాబట్టే తను ప్రేమించిన, తనను ప్రేమించిన, మృదులను కాదంటాడు.

'లేత రంగు చీర కట్టుకుని, వదులుగా వేసుకున్న జడతో మల్లెపందిరి మీది నుంచీ వీచినప్పుడు సుగంధంలా ఉంది మృదుల.

కాటుక పెట్టుకున్న నీలినేత్రాలూ, చిలిపిగా తెరిచి మూసుకునే కనురెప్పలూ, ఎడమ చెంపమీద చిన్న పుట్టుమచ్చా, కంఠం మీది నీలిచారలూ...' మృదుల గురించిన వర్ణన.

'కాసేపటిలోనే ఆమె కోపం మరచిపోయి నవ్వుతూ మాట్లాడసాగింది. అది ఆమె స్వభావం. అది ఆమె సహజ పరిమళం. ఏ అదృష్టవంతుడు, ఎక్కడ పెట్టి పుట్టీ, ఆమె కోసం నివసిస్తున్నాడో గానీ, అతన్ని చూసి లోకం ఈర్ష్యతో భగ్గుమనక తప్పదు' అనుకుంటాడు, ఆమె స్వభావం గురించి. ఆమె అంటే తనకి ప్రేమ లేదా అనుకుంటే, 'ఏంకాదు ఈ భూమ్మీద నాకు అత్యంత ఆహ్లాదం కలిగించే ప్రదేశం నీ చుట్టూ ఉన్న నూరుగజాలు' అంటాడు. కానీ మృదుల చేత బండరాయి అనిపించుకుంటాడు ఎన్నిసార్లో.

నైట్ డ్యూటీలో ఉండగా తనని నిద్రనుంచీ లేపలేదని తిడుతుంది. 'ఫో నువ్వు జీవితంలో అమూల్యమైన మూడు నాలుగు గంటల కాలాన్ని వృధా చేసేశావు. ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ కూర్చునేవాళ్ళం కదా!'

'మృదులా! షష్టియరునుంచీ ఇంతవరకూ, ఆరేళ్ళపాటు క్లాస్‌మేట్స్‌గా గడిపాం. ఎన్నో వందల గంటలు కబుర్లు చెప్పుకున్నాం. ఈ రెండూ మూడు గంటలేనా అమూల్యమైనవి?'

'కఠిన శిలవి, కేవలం మొరటు డాక్టరువి. నీకు అర్థంకాదులే' అంటుంది.

ఇద్దరూ కలిసి మెట్లు దిగుతున్నప్పుడు, మలుపులో ఎవరూ లేనప్పుడు మృదుల అతని చెయ్యి పట్టుకుంటుంది. వెంటనే ఆమె ముఖంలోకి చూద్దామనుకున్న ఊహను అంతలోనే తుంచి వేసి, ఏమీ గమనించినట్లు మామూలుగానే దిగుతాడు. ఇంకోసారి, 'కాస్త మెల్లగా అడుగులు వెయ్యి, ఇల్లు త్వరగా వచ్చేయటం నాకు బాగుండదు' అంటుంది మృదుల. అప్పుడు మధు, 'కొన్ని చెరగని ఇష్టాలుంటాయి. ఎలాంటి పరిస్థితిలోనూ, ఎలాంటి అనుభూతుల్లోనూ అవి అలాగే నిలబడి ఉంటాయి' అనుకుంటాడు.

అలా వాళ్ళ ప్రేమ కథ చెప్పీ చెప్పకుండా, చాలా సున్నితంగా, ఆ మాట కోస్తే ప్రేమ అన్న పదం వాడకుండా చెప్పుకొస్తాడు. ఎంత తన ప్రేమని అణిచి పెట్టుకున్నా, అనుకోకుండా ఒక్కోసారి బయటపడుతుంది. తనకి ఒంట్లో బాగుండనప్పుడు, మృదుల చూడటానికి వస్తే, కళ్ళనీళ్ళు తిరుగుతాయి.

'బండరాయీ! నీ కళ్ళలో నీళ్ళు చిమ్మాయేం?'

బలవంతంగా నా ముఖంలోకి నవ్వు తెచ్చుకున్నాను. 'బండరాయికి గుండె ఉంటుందని...'

'గుండె ఉంటుందిలే! అయితే అది సిరలూ, ధమనులలో కనెక్ట్ చేయబడి రక్తప్రసారం చేస్తూ బండి సరిగ్గా నడుస్తుందా లేదా అన్న ధ్యాస తప్ప మరొకటి లేదు. ఆ రక్తకణాల్లో కొందరు కావాలనుకునేవి తొణికిసలాడవు.'

అంత పెద్ద నింద వేసినా మృదులకు అతను బాగానే అర్థమౌవుతాడు.

'నేను వెలుగును కాను, వొట్టి చీకటిని' అన్న మధుతో' అవును నువ్వు చీకటివే. ఆ చీకటి గర్భాన్ని నిర్దాక్షిణ్యంగా కోసి, లోపల చూస్తే రేడియమ్‌ని మించిన కాంతి, సూర్యకాంతికి తళతళలాడే నీటి బిందువులో ఎంత స్వచ్ఛత ఉందో, నీ మనోహరమైన చిరునవ్వులో అంతటి స్వచ్ఛత, ఆకర్షణా ఉన్నాయి అంటుంది.

అంతేకాదు మొదట్లోనే తెగేసి చెప్పేస్తుంది, 'ఒకరు నీకోసం రాజీపడాలిగానీ, ఒకరికోసం నువ్వు రాజీపడవు. నా జీవితానికిది తప్పదు' అని నిట్టూరుస్తుంది. అదే మనకి సూచన వాళ్ళ ప్రేమ కథ ఎలా ముగుస్తుందో ఊహించటానికి తన సర్వస్వాన్ని దోసిటపట్టి, ఆ దోసిలిలో హారతి ఉంచి, మధు కళ్ళముందు తిప్పినట్లు చేసిన మృదుల, మధు వివరించి చెపితే అర్థం చేసుకుంటుంది.

'నేనో ఉన్మాదిని. నా తృష్ణకు అంతులేదు. ఎక్కడెక్కడికో పోవాలని, ఏవేవో ఘనకార్యాలు చేయాలని ఉద్రూతలూగి పోతున్నాను. వెఱ్ఱిగా చదవాలి, విపరీతమైన అనుభవాన్ని సంపాదించాలి. మెడిసిన్‌లో ఎన్నో అంతు తెలియని సమస్యలున్నాయి. వాటిలో కొన్నిటినైనా

నేను తెలుసుకోగలిగి, పరిష్కరించగలగాలి. రెసెర్చ్! ఈ మంట నా మనస్సులో ఉడుకులెత్తి పోతుంది. దహించుకుపోతున్నాను. నన్నర్థం చేసుకో మృదులా!‘

‘అర్థం చేసుకున్నాను. ఇంకా మిగలనంతగా అర్థం చేసుకున్నాను. నీ ప్రయాణమెప్పుడు?‘

***అలా తన జీవన సాఫల్యం చేసుకోవటానికి సుదీర్ఘ ప్రయాణం చేయబోయే మధుకి బరువెక్కిన గుండెతో మృదుల, ఆమెతో పాటు మనమూ వీడ్కోలు ఇస్తాము.***

## *నవ్వితే నవ్వండి..!*

*"వెధవది ఈ టి.వి.ఛానెళ్ళు పెరిగిపోవడమేమిటో కానీ ప్రతి అడ్డమైన వెధవతోనూ ఇంటర్వ్యూలు వేస్తున్నారు.." కడుపుడుకు కోదండంగారు తన మిత్రుడి వద్ద వాపోయారు.*

*"ఏం..మీ ఇంటర్వ్యూ ఇంకా రాలేదేమిటీ..? " అదీ మిత్రుడి సమాధానం!*

****

*హైస్కూలు మాస్టారు ముకుందం గారు ఏడో తరగతి పిల్లల కాంపోజిషన్ పుస్తకాలు మోసుకుంటూ క్లాసులోకి వచ్చారు.*

*"మాస్టారు..గాడిద బరువు మోస్తున్నారా.." కిసుక్కున అన్నాడు అప్పన్న.*

*అదివిన్న ముకుందం గారు..*

*"అవునా అబ్బీ..ఇది గాడిద బరువే..ఒక్క గాడిద బరువు కాదు..30 గాడిదల బరువు " అన్నారు.*

*క్లాసులో ఉన్న 30 మంది పిల్లల మొహాలు ఎలా వున్నాయో మీరే ఊహించుకోండి..*